# అంకితం

- సోమయాజి



"ఆ వీధి గుమ్మం దగ్గరే నిలబడి వున్నావ్ శంకర్ యింకా యింటికి రాలేదా!" అంది శంకర్ బామ్మగారు.

"మీ మనవడి సంగతి మీకు తెలీందేముంది. కథల సంపుటి అంటూ రోజూ అదే పని మీద వుంటున్నారు. కవర్ మీద బొమ్మ బాగుంటే పుస్తకాలు బాగా అమ్ముడుపోతాయట. ఎవరో పెద్ద ఆర్టిస్టుకి వెయ్యి రూపాయలు ఎడ్వాన్స్ యిచ్చి తిరుగుతున్నారు" అంది పార్వతి.

"ఏమిటో వీడు శివశంకర్ కాదే! తిక్క శంకర్. వీడేమన్నా కథా రచయితా ఏం వీడి కథల సంపుటి వేడి వేడి పకోడీల్లా అమ్ముడుపోవడానికి"

ఇంతలో శంకర్ వచ్చాడు.

"ఏరా ఏమైంది నీ కథల సంపుటి!"

"అలాగే అనవే బామ్మ! ఓ రోజు నువ్వే, చాలా మంచి పని చేశావురా అని మెచ్చుకుంటావ్"

"రండి! కాళ్ళు కడుక్కుంటే భోంచేద్దాం! కథల ముచ్చట్లు మనకెప్పుడూ వున్నవే!" అంది పార్వతి.

***

మర్నాడు పొద్దున్నే బయల్దేరాడు.

బామ్మ అడిగింది "ఏరా మళ్ళీ అదే పని మీద వెళుతున్నావా! లక్షణంగా ఉద్యోగం చేసుకోక, వున్న సెలవు తగలేసుకుని సంపుటి... సంపుటి అని తిరుగుతావేమిట్రా!"

"ఏం చేస్తాం పుస్తకం అచ్చుయిపోతోంది. బొమ్మ వేయడానికి ఎడ్వాన్స్ కూడా యిచ్చేశా. ఎప్పుడూ జీవితంలో వెనకడుగు వేయకూడదని నువ్వంటూంటావ్ కదా!"

"బాగుంది వరస! మీ తాతలాగే మాట్లాడుతున్నావ్"

"నేను తాతలా మాట్లాడగలను కానీ తాత నాలా ఒక్క కథేనా రాశాడా!"

"సర్లే! హెచ్చులు మాని పని చూసుకో" అంది బామ్మ. ఆరోజు పనయితేగాని యింటికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు శంకర్. ఆర్టిస్ట్‌ని కలిసాడు. బొమ్మ వేయడానికి కనీసం యింకో నెల పడుతుందన్నాడు ఆర్టిస్ట్. ఎలా అయినా తొందరగా వేసి పెట్టమన్నాడు శంకర్.

"పాడమంటే పాడేది పాటకాదు, వెయ్యమంటే వేసేది బొమ్మకాదు" అన్నాడు ఆర్టిస్ట్.

ఎలా అయినా సహాయం చెయ్యమన్నాడు శంకర్.

"నేను బొమ్మ వేశానంటే తిరుగుండదు. కావాలంటే మీ వెయ్యి తిరిగిచ్చేస్తా"నంటూ డబ్బు వాపస్ యిచ్చేశాడు.

***

రెండు నెలలు తిప్పించుకుని ఆఖరికి తన పని చెయ్యనందుకు శంకర్ బాధపడ్డాడు. సెలవులో వున్న శంకర్ ఏం చెయ్యాలో పాలుపోక ఆఫీస్‌కి వెళ్లాడు. సాయంకాలం వరకూ ఆఫీస్‌లోనే గడిపి, తన మిత్రునితో కలిసి రామకృష్ణా బీచ్‌కి వెళ్ళాడు. విషయమంతా తన మిత్రునికి వివరించాడు శంకర్.

"కడుపు నిండిన కళాకారులకి కాసులు లెఖ్ఖ వుండదురా! అదిగో అక్కడ చూడు ఏసుక్రీస్తు బొమ్మ మసిబొగ్గుతో గీస్తున్నాడు! అతను తృప్తిగా భోంచేసి ఎన్నో రోజులయి వుంటుంది. కడుపు నిండా అన్నం పెట్టించి, ఓ వంద రూపాయలిస్తే, ఓ నిముషంలో నీక్కావలసిన బొమ్మ వేసిస్తాడు" అన్నాడు మిత్రుడు.

"బాబూ చచ్చి నీ కడుపున పుడతా! అతని చేత బొమ్మ వేయించి పుణ్యం కట్టుకో!" అన్నాడు శంకర్.

"బొమ్మ వేయడానికి కావలసిన డ్రాయింగ్ పేపర్, కలర్స్ ఓ క్యారియర్ నిండా భోజనం తీసుకుని రేపురా" అన్నాడు మిత్రుడు.

"రేపు యితను దొరకాలి కదురా!"

"గీసిన బొమ్మ మాసేవరకూ యీ ప్రాంతంలోనే వుంటాడు"

***

ఆ మర్నాడు తన మిత్రుడు చెప్పినట్లే చేశాడు. ఆశ్చర్యం ఆ బొమ్మలు గీసే అతను యింగ్లీషు స్వచ్ఛంగా మాట్లాడుతున్నాడు. శంకర్ తెచ్చిన అన్నం తిని చెప్పిన వివరాల ప్రకారం ఓ మంచి బొమ్మ గీసిచ్చాడు ఆ 'స్ట్రీట్ ఆర్టిస్ట్' వంద యివ్వపోతే కళామతల్లి అన్నం పెట్టింది చాలు అన్నాడు.

ఆ స్ట్రీట్ ఆర్టిస్ట్‌ని నువ్వు "క్రిస్టియన్‌వా?" అని అడిగాడు శంకర్. "కాదు అన్ని దేవుళ్ళ బొమ్మలూ వేస్తాను కాని, 'చెప్పులు లేవని బాధపడకు, అసలు కాళ్ళు లేనివాళ్ళెందరో వున్నార'న్న బైబిల్ సూక్తంటే నాకు చాలా యిష్టం. అందుకే జీసస్ క్రైస్ట్ బొమ్మ ఎక్కువసార్లు వేస్తాను" అన్నాడు ఆ ఆర్టిస్ట్.

అతనికి కృతజ్ఞతలు చెప్పి యింటికి వచ్చాడు శంకర్. ఆ బొమ్మ తన బామ్మగారికి చూపించి వివరాలు చెప్పాడు.

"హారిభడవా! మొత్తానికి సాధించావ్. చేతిలో పనితనం వుండి కూడా, పనిలేని వార్ని పట్టుకుంటే మన పని సులువుగా అవుతుందిరా, తిక్కశంకరం! ఈ కథల సంపుటి మొదలుపెట్టి నువ్ చేసిన మంచి పని ఏమంటే, ఆకలితో అలమటించే వాడికి, యింట్లో వండిన అన్నం పట్టుకెళ్ళి వాడి ఆకలి తీర్చడం. ఇది నీకు కోటిగుణితంరా, నాయనా!" అని చెపుతున్న కళ్ళల్లో దివ్యకాంతి చూశాడు శంకరం. పుస్తకం అచ్చయింది. ఆ కథల సంపుటి మొదటి పేజీలో 'శక్తివుండి కూడా రాణించలేనివారికి అంకితం' అని రాశాడు

★